
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ၊ 13 ၊ ఫిబ్రవరి ၊ 2025



సోమశిలలో 63.998 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 63.998 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,951
3 శాతం జీఎస్టీతో	రూ.8,190
నవర (8 గ్రా)	రూ.65,520

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.3 /22.2

జిల్లాలో వాతావరణం గురువారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 63 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

కిసాన్ మేళా రేపు



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

నెల్లూరు(సెంట్రల్): ఆధునిక సాంకేతికత.. లాభసాటి వ్యవసాయం అనే అంశంపై నగరంలో కిసాన్ మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థాన సహాయ సంచాలకులు సుమతి పేర్కొన్నారు. నగరంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడారు. ఆధునిక వ్యవసాయంపై ప్రత్యేక అవగాహనతో పాటు వివిధ ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని వెల్లడించారు. దాదాపు రెండు వేల మంది రైతులు హాజరయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు వినీత, లలితాశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సూచనలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

కందుకూరు: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు గానూ కందుకూరుకు సీఎం చంద్రబాబు శనివారం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు బుధవారం పరిశీలించారు. తొలుత టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. టిడ్కో ఇళ్ల సముదాయం, వాసవీనగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలతో సీఎం ముఖాముఖి నిర్వహించనున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశనం చేశారు. పోలీస్ బందోబస్తు, బ్యారికేడ్లు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి, నెల్లూరు కమిషనర్ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు 197 మంది గైర్హాజరు



నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌కు జిల్లా వ్యాప్తంగా 197 మంది విద్యార్థులు బుధవారం గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 3953 మందికి గానూ 3842 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 3709 మందికి గానూ 86 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని పలు కళాశాలలను ఆర్ఐఓ శ్రీనివాసులు.. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, పొదలకూరు తదితర ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు.

విప్ ధిక్కారంపై కార్పొరేటర్లకు నోటీసులు

నెల్లూరు(అర్బన్): ఇటీవల నిర్వహించిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించిన 42 మంది కార్పొరేటర్లకు ప్రిసైడింగ్ అధికారి, జేసీ కార్తీక్ షోకాజ్ నోటీసులను బుధవారం జారీ చేశారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి కరిముల్లాకు కాకుండా టీడీపీ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థికి 40 మంది కార్పొరేటర్లు ఓటేయగా, మరో ఇద్దరు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. వీరిపై అనర్హత వేటేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విప్ జారీ చేసిన ఊటుకూరు నాగార్జునతో పాటు పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి.. జేసీకి వినతిపత్రమిచ్చారు. ఈ తరుణంలో విప్‌ను ఉల్లంఘించిన కార్పొరేటర్లు వారంలోపు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులను జేసీ జారీ చేశారు.

నిందితుడి అరెస్ట్

కావలి: పట్టణంలోని ముసునూరు కేజీబీవీలో ఈ నెల 8న అర్ధరాత్రి బాలికల రూమ్‌లోకి వెళ్లి ఒకరిపై దాడి చేసిన నిందితుడ్ని అరెస్ట్ చేశామని కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు బుధవారం చెప్పారు. కావలి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

లక్ష్యం ప్రాక్టికిల్



ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థులు

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో సాధ్యమైనంత ఎక్కువ మార్కులు దక్కించుకొని.. తమ కాలేజీల కీర్తిప్రతిష్టలు చాటాలనే లక్ష్యంగా జిల్లాలోని పలు కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి. వాస్తవానికి ఈ పరీక్షలను గతంలో జంబ్లింగ్ పద్ధతిన జరిపేవారు. దీని ద్వారా పారదర్శకంగా నిర్వహించడం సాధ్యమయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ విధానానికి చరమగీతం పాడి.. పాత సెల్ఫ్ సెంటర్ల పద్ధతిని అమల్లోకి తీసుకురావడంలో విద్యాసంస్థలకు అధిపతైన ఓ మంత్రి సఫలీకృతులయ్యారు. తదనుగుణంగా తన కళాశాలల్లో ప్రాక్టికల్స్‌లో అక్రమాలకు యథేచ్ఛగా పాల్పడుతున్నా, వత్తాసు పలకడం అధికారుల వంతవుతోంది.

- మార్కులే పరమావధిగా నిబంధనలకు తూట్లు
- నగరంలోని ఓ కళాశాలలో మాస్ కాపీయింగ్
- ఎగ్జామినర్‌ను రిలీవ్ చేసిన ఆర్ఐఓ
- గోప్యంగా ఉంచిన ఇంటర్ బోర్డు అధికారులు
- జిల్లాలోని అధిక కేంద్రాల్లో ఇదే తంతు
- 121 కేంద్రాలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లే

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్ జరుగుతోంది. సెల్ఫ్ సెంటర్లలోనే వీటిని నిర్వహిస్తుండటం కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు వరంగా మారింది.

అన్ని చోట్లా ఇదే తంతు..

నగరంలోని ప్రముఖ విద్యాసంస్థలతో పాటు ఆత్మకూరు, కావలి, కందుకూరులోని పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోందని విద్యార్థులే చెప్తుండటం గమనార్హం. ప్రాక్టికల్స్ ప్రారంభమై మూడు రోజులైనా, ఇప్పటి వరకు ఒక్క మాల్ ప్రాక్టిస్ కేసు నమోదు కాకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. జిల్లాలోని 121 పరీక్ష కేంద్రాలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లనే ఏర్పాటు చేయడం విశేషం.

అధికార పార్టీ మంత్రికి సంబంధించిన కళాశాలలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో ఇంటర్ బోర్డు అధికారులు సైతం మొక్కుబడి తనిఖీలతో సరిపుచ్చుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జరిగిందిదీ..


స్టోన్‌హౌస్‌పేటలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల సెంటర్‌లో నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్ జరగసాగింది. ఆర్ఐఓ శ్రీనివాసులు పరిశీలించగా, ఈ అంశం వాస్తవమని తేలింది. పరీక్ష అనంతరం సదరు ఎగ్జామినర్‌ను విధుల నుంచి తొలగించారు. అయితే మాస్ కాపీయింగ్‌కు ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టలేదు. కాగా సాంకేతిక అంశంతోనే రిలీవ్ చేశామని ఇంటర్ బోర్డు అధికారులు చెప్తుండటం గమనార్హం.

భారీగా ముట్టజెప్తూ..

ప్రస్తుతం ఏ కళాశాలలోనూ సైన్స్ విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించే పరిస్థితే లేదు. చివరికి రసాయనాల పేర్లను సైతం వీరికి తెలియజేసే అవకాశమే కానరావడంలేదు. అయితే ప్రాక్టికల్స్ నాటికి అంతా సరిచేసుకోవచ్చనే భావనలో కళాశాలల యాజమాన్యాలు ఉంటున్నాయి. ఇందులో భాగంగా ఇంటర్ బోర్డు నియమించిన ఎగ్జామినర్లను మేనేజ్ చేసుకుంటున్నారు. వీరితో ముందే మాట్లాడుకొని నగదు ముట్టజెప్తున్నారనే విమర్శలున్నాయి.

ఇవిగో.. మైక్రో జిరాక్స్‌లు

రసాయనాలతో ప్రాక్టికల్స్‌ను అంతంతమాత్రంగా చేస్తున్నారు. మైక్రో జిరాక్స్‌లను అందజేసి రికార్డులు రాయిస్తున్నారని సమాచారం. ప్రభుత్వ కళాశాలల నుంచి వచ్చిన చీఫ్ సూపరింటెండెంట్లకు సైతం ముట్టజెప్తున్నారని తెలుస్తోంది. మరోవైపు అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లుగా అదే కళాశాలల ప్రిన్సిపల్స్‌ను నియమించారు.



సీసీ కెమెరాలా..?

వాస్తవానికి ప్రాక్టికల్స్ జరుగుతున్న ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు ఆదేశించినా జిల్లాలో అదెక్కడా అమలు కావడం లేదు. కొన్ని చోట్ల అరకొరగా.. మరికొన్ని ప్రాంతాల్లో వీటి ఊసేలేదు. ఈ ఫుటేజీలను పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఆర్ఐఓ, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మొక్కుబడి తనిఖీలకే పరిమితమవుతున్నారు. అధికారులొస్తున్నారనే సమాచారాన్ని అధికార పార్టీ నేత కళాశాలలకు ముందుగానే చేరవేస్తున్నారనే ప్రచారం ఉంది. ప్రాక్టికల్స్‌లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారి దృష్టి సారించి పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆర్ఐఓ కనుసన్నల్లోనే..



“ ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జరుగుతున్న అక్రమాలను ఆర్ఐఓకు విద్యార్థి సంఘాల నేతలు పలుమార్లు తెలియజేశారు. అయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తనిఖీలకు వెళ్లే సమయాల్లో కళాశాలల యాజమాన్యాలకు ముందే సమాచారమిచ్చి వారిని అప్రమత్తం చేస్తున్నారు. దీని ద్వారా మాస్ కాపీయింగ్ జరగలేదంటూ సమర్థించుకుంటున్నారు.

– మస్తాన్, జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

చర్యలు చేపట్టాలి



“ ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్‌కు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పాల్పడుతున్నాయి. ప్రతి కేంద్రంలో విద్యార్థులకు మైక్రో జిరాక్స్‌లను అందించి ఈ తంతుకు తెరలేపారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తే అక్కడ జరుగుతున్న అక్రమాలు వెలుగులోకి వస్తాయి. లేని పక్షంలో కలెక్టర్‌కు తెలియజేసి చర్యలు చేపట్టేంత వరకు ఆందోళన చేపడతాం.

– వెన్ను నరేంద్ర, జిల్లా అధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ

పరిశీలిస్తున్నాం

ప్రాక్టికల్స్ జరుగుతున్న కేంద్రాలను నాతో పాటు డీఈసీ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. కేంద్రాలకెళ్లి పది లేదా 15 నిమిషాలే ఉంటాం. పరీక్ష ముగిసేంత వరకు ఒకే చోట ఉండటం కుదరదు. కళాశాలల యాజమాన్యాలు, ఎగ్జామినర్ల మధ్య ఒప్పందం ఉండొచ్చు. అయితే దీనిపై ఎలాంటి సమాచారం లేదు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారనే విషయం తెలిస్తే పరిశీలించి కళాశాల యాజమాన్యంపై చర్యలు చేపడతాం

– శ్రీనివాసులు, ఆర్ఐఓ

తప్పుడు కథనాలతో పైశాచికానందం

- రామదాసుకండ్రిగ భూముల్లో అవినీతి టీడీపీ హయాంలోనే
- పరిశ్రమలు రాకుండా అడ్డుకుంటున్న సోమిరెడ్డి
- మండిపడిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధనదాహానికి అడ్డే లేకుండాపోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. తమ పార్టీలో చురుగ్గా ఉంటున్న వారితో పాటు, వారి కుటుంబసభ్యులపై ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ప్రచురించి పైశాచికానందాన్ని పొందుతోందని ఆరోపించారు.

భారీ అవినీతి మీ ప్రభుత్వంలోనే..

వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగలోని సీజేఎఫ్ఎస్ భూముల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగింది అప్పటి టీడీపీ హయాంలోనేనని పేర్కొన్నారు. నిరుపేదలు సాగు చేసుకునేందుకు నాలుగు దశాబ్దాల క్రితం మంజూరు చేసిన భూములను పరిశ్రమల శాఖకు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో కొందరు నేతల కన్ను దీనిపై పడిందనే అంశాన్ని ప్రస్తావిస్తూ 'పేదల భూమిపై రాజకీయ రాబందులు' అనే శీర్షికన ఓ పత్రికలో 2016 ఆగస్ట్ పదిన కథనాన్ని ప్రచురించారని చెప్పారు. ఆ సమయంలో టీడీపీ అధికారంలో ఉందని, అప్పట్లో ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాత్ర ఇందులో ఉన్నా, ఆయన పేరును ప్రస్తావించకుండానే కథనాన్ని ప్రచురించారని విమర్శించారు.

ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకొని..

వాస్తవానికి సదరు భూములను కాజేయాలనే లక్ష్యంతో రూ.ఆరు లక్షలకు వారితో మాట్లాడుకొని, గూడూరు ఐడీబీఐ బ్యాంక్‌లో ఖాతాలను ప్రారంభించి, ఖాళీ చెక్కులపై సంతకాలను సేకరించిన ఘనుడు సోమిరెడ్డి అని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు సదరు రైతుల ఖాతాల్లో నగదు జమవ్వగానే, దాన్ని డ్రా చేసుకునేలా వందెకరాలకు వేసిన స్కెచ్ అని చెప్పారు. ప్రక్రియలో సదరు భూములకు సంబంధించిన పేద రైతులను అనేక ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. బాధితులు తనను సంప్రదించగా, వారికి న్యాయం చేయాలనే లక్ష్యంతో వ్యవహరించానని గుర్తుచేశారు. అంతా పారదర్శకంగా జరగడంతో ఏమి చేయాలో పాలుపోక తన కుటుంబసభ్యులను ఇందులో ఇరికించేందుకు సోమిరెడ్డి యత్నించారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే హోదాలో భూములు పరిశీలించా

ఈ వ్యవహారంలో సోమిరెడ్డి తీరుపై 'పేదల పరిహారం.. పెద్దలకు ఫలహారం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైందని చెప్పారు. దీంతో గ్రామంలోని కొందరు రైతులను దళారులు మోసగించేందుకు 60 మందితో గూడూరు ఐడీబీఐ బ్యాంక్‌లో ఖాతాలను ప్రారంభించారంటూ అప్పటి జేసీ ఇంతియాజ్ పలు విషయాలను తెలియజేసిన అంశాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న తాను సదరు భూములను పరిశీలించానని చెప్పారు. ఆనాడు జరిగిన విక్రయాలపై విజిలెన్స్‌తో విచారణ చేయిస్తామని సోమిరెడ్డి చెప్తున్నారని.. అలా చేయిస్తే మంచిదే గానీ ఆయన చెప్పిన విధంగానే నివేదికను తయారు చేసే అవకాశం ఉందని తెలిపారు.

సోమిరెడ్డికి ముడుపులిస్తేనే పరిశ్రమలు

పొదలకూరులోని లేఅవుట్ల వద్ద డబ్బులు కొట్టేసి హైదరాబాద్‌లో సోమిరెడ్డి తన కుమార్తె పేరిట విల్లా తీసిచ్చారని ఆరోపించారు. ఆయన ఉన్న బాడుగ ఇళ్లను కుమారుడు కొనుగోలు చేశారని, బెంగళూరులో ఎవరి పేరుతో ఇళ్లు కట్టారో తనకు తెలుసునన్నారు. ఆయన అవినీతి పుణ్యమానని క్రిబ్కో పరిశ్రమ వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు. సర్వేపల్లిలో పరిశ్రమలను నెలకొల్పాలంటే ముందుగా తన ఇంటికొచ్చి డీల్ కుదుర్చుకున్న తర్వాతేనని కలెక్టర్‌తో సోమిరెడ్డి చెప్తున్నారని ధ్వజమెత్తారు. ఆయనకు ముడుపులు సమర్పిస్తే గానీ పరిశ్రమలొచ్చే పరిస్థితి లేదన్నారు. సీబీసీఐడీతో విచారణ చేయిస్తే ఆయన ఏ విధంగా అవినీతికి పాల్పడ్డారో ఆధారాలతో సహా తెలియజేస్తానని వెల్లడించారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతి నుంచి ఐఐటీ, నీట్ అకాడమీలో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నామని వివరించారు. apbragcet. apcfss. in ద్వారా వచ్చే నెల ఆరో తేదీ సాయంత్రం ఐదులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలకు చెక్కు అందజేత



నెల్లూరు (టౌన్) : రంగనాయకులపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు రూ.5,87,456 చెక్కును హెచ్ఎం కల్పనాదేవికి ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ నగదుతో రేకుల షెడ్డు, ఐదు కంప్యూటర్లు, ప్రింటర్, టేబుల్స్, 14 కుర్చీలు, మూడు ఫ్యాన్లు, నాలుగు టేబుళ్లు, విద్యుత్ గంటను కొనుగోలు చేయనున్నారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ శేషగిరి, హెచ్ఆర్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులపై కన్నెర్ర

మద్యం పాలసీలో భాగంగా జనావాసాల మధ్య వైన్ షాపుల ఏర్పాటును అంగీకరించేదిలేదని గ్రామస్తులు తేల్చిచెప్పారు. పచ్చని పల్లెల్లో శాంతిభద్రతలు క్షీణించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నెలకొల్పితే ఉపేక్షించేదిలేదంటూ పెద్ద ఎత్తున ఆందోళనలను బుధవారం చేపట్టారు.

భారీ ఆందోళన



జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక మద్యం దుకాణాన్ని కోదండరామపురానికి మార్చడాన్ని నిరసిస్తూ షాపు వద్ద గ్రామంలోని మహిళలు, ప్రజలు బుధవారం ఉదయం ఆందోళన చేపట్టారు. గ్రామంలో వద్దంటూ నినాదాలు చేశారు. గ్రామంలో గతంలో అందరూ ఏకగ్రీవంగా తీర్మానించి తొలగించామని తెలిపారు. ఈ క్రమంలో జలదంకి ఎస్సై తన సిబ్బందితో వచ్చి దర్నా చేయొద్దని మహిళలకు సూచించారు. అయినా మహిళలు, ప్రజలు తమ నిరసనను కొనసాగించారు. ఘటన స్థలానికి కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు చేరుకొని వారితో మాట్లాడారు. మద్యం షాపునకు అనుమతిచ్చామని, సమావేశాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని వివరాలను అధికారులకు తెలియజేసి తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు.

మహిళల నిరసన



ఆత్మకూరు రూరల్: మండలంలోని వాశిలి దళితవాడలో మద్యం షాపు ఏర్పాటుపై స్థానిక మహిళలు నిరసనను బుధవారం చేపట్టారు. వాస్తవానికి జాతీయ రహదారి నుంచి కుప్పురుపాడుకు వెళ్లే రోడ్డు పక్కన గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో పలువురు దళితులు గృహాలను నిర్మించుకున్నారు. ఈ క్రమంలో స్థానిక టీడీపీ నేతల ప్రోద్బలంతో కాలనీలో మద్యం షాపు ఏర్పాటుకు నిర్వాహకులు ఏర్పాట్లు ప్రారంభించారు. దీంతో స్థానిక మహిళలు అక్కడికి భారీగా చేరుకున్నారు. తమ కాలనీలో మద్యం షాపును ఏర్పాటు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడతామంటూ నిరసన చేపట్టారు.

నమ్మించి.. మోసం చేసి..

వందల సంఖ్యలో సుభాని బాధితులు

- విచారణ చేస్తున్న పోలీసులు
- మోసపోయిన చిరువ్యాపారులు, ఉద్యోగులు

కావలి: స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించి కావలి పట్టణంతో పాటు సమీప ప్రాంతాల ప్రజలను నమ్మించి సుమారు రూ.200 కోట్ల వరకు వసూలు చేసిన మోసగాడు షేక్ మహబూబ్ సుభాని లీలలు మరి కొన్ని వెలుగులోకి వచ్చాయి. స్టాక్ బ్రోకింగ్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన ఇతడు షేర్ మార్కెట్‌లో లాభాలు ఆశ చూపి కోట్ల రూపాయలు కొల్లగొట్టాడు. ఓ చిరువ్యాపారి ఇంటిపైన రుణం, బ్యాంక్ లోన్లతోపాటు తెలిసిన వాళ్ల దగ్గర అప్పు తీసుకుని సుమారు రూ.70 లక్షల వరకూ సుభాని వద్ద పెట్టుబడిగా పెట్టాడు. ఇప్పుడు సదరు వ్యక్తి బోర్డు తిప్పేయడంతో బాధితుడు ఆత్మహత్య చేసుకునే పరిస్థితుల్లో ఉన్నాడు.

పాపం బాధితులు

- కావలికి చెందిన 65 ఏళ్ల విశ్రాంత ఉద్యోగి ఒకరు ఇదే తరహాలో సుభాని చేతిలో మోసపోయాడు. బ్యాంక్‌లో తక్కువ వడ్డీకి ఉన్న డబ్బులు స్టాక్ మార్కెట్‌లో పెడితే మెరుగైన లాభాలతో మలిసంధ్య ప్రశాంతంగా గడిచిపోతుందని అనుకున్నాడు. తన సేవింగ్స్‌తోపాటు అప్పుల ద్వారా మొత్తం రూ.35 లక్షలను సుభాని చేతికిచ్చి నిలువునా మోసపోయాడు.
- ఒకరు రూ.30 లక్షలు, ఇంకొకరు రూ.53 లక్షలు, మరొకరు రూ.25 లక్షలిలా గుంటూరుకు చెందిన సుభాని చేతిలో మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో తేలుతున్నారు. ముసునూరులోని కార్యాలయం వద్ద రోజంతా పడిగాపులు పడుతూ కనిపించిన వాళ్లందరినీ కన్నీళ్లతో వేడుకుంటున్నారు.



సుభాని కట్టించిన భవనం

గుంటూరు నుంచి..

మూడేళ్ల క్రితం గుంటూరు నుంచి కావలి పట్టణంలోని ముసునూరుకు మకాం మార్చిన సుభాని స్థానికంగా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో మెళకువలు నేర్పిస్తానంటూ భారీ భవనం నిర్మించి సొంతంగా కార్యాలయం ప్రారంభించాడు. స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్ చేయడం, ఫ్యూచర్, ఆప్షన్స్, కమోడిటీ ట్రేడింగ్ ద్వారా రూ.లక్షకు రూ.నాలుగైదు లక్షలు సంపాదించుకునేలా మూడు నెలలు శిక్షణనిస్తామంటూ ముమ్మరంగా ప్రచారం చేశాడు. అతడి మాటలు నమ్మిన యువత, స్థానికులు తొలుత శిక్షణా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆ తర్వాత లైవ్ ట్రేడింగ్‌లో లాభాలు వచ్చినట్లు కనికట్టు చేశాడు. దీంతో శిక్షణ పొందిన వాళ్లు, వాళ్ల బంధువులు, స్నేహితులు తొలుత చిన్నచిన్న మొత్తాలతో సుభాని వద్దే ట్రేడింగ్ చేశారు. అందరికీ లాభాలు చూపించడంతో అతి తక్కువ కాలంలోనే భారీ సంఖ్యలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. దీంతో అతను పంథా మార్చి అందరికీ ట్రేడింగ్‌లో లాభాలు తీసివ్వడం కుదరదని, రూ.లక్షకు వారానికి రూ.2 వేల వంతున నెలకు రూ.8 వేలు లాభం ఇస్తానని నమ్మించడంతో ఒక్కొక్కరు రూ.లక్షలు అప్పులు తెచ్చి మరీ పెట్టుబడిగా పెట్టారు. చెప్పిన విధంగానే అందరికీ ప్రతి వారం లాభాలు పంచుతూ ఏడాది కాలంలోనే సుమారు రూ.200 కోట్ల వరకూ జనం సొమ్ము దోచేశాడు. గత నెల చివరి వారం నుంచి చెల్లింపులు సరిగా చేయకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సుభానిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

వారే ఏజెంట్లుగా...

ప్రజల్లో నమ్మకాన్ని సంపాదించుకునేందుకు సుభాని పోలీసు సిబ్బంది, చిన్నచిన్న ప్రభుత్వ ఉద్యోగులను ఏజెంట్లుగా మార్చుకున్నాడు. లాభాలు వస్తున్నాయంటూ కళ్లు తిరిగే స్థాయిలో కమీషన్లు ముట్టజెబుతూ జనాల సొమ్ము కొల్లగొట్టాడు. సుభాని వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత కావలి పోలీసుల్లో కలకలం రేగింది. ముగ్గురు, నలుగురు కానిస్టేబుళ్లు అతడి మాటలు నమ్మి తమతోపాటు తెలిసిన వారిచేత కూడా భారీగా పెట్టుబడులు పెట్టించినట్లు సమాచారం.

ముందే హెచ్చరించిన 'సాక్షి'

ముసునూరులో స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాన్ని 'సాక్షి' ఆరునెలల ముందే గుర్తించింది. గతేడాది ఆగస్ట్ 24వ తేదీ సంచికలో 'అధిక రాబడి ఆశతో భారీగా పెట్టుబడులు' శీర్షికన జరుగుతున్న మోసాన్ని వెలుగులోకి తీసుకొచ్చి ప్రజలను అప్రమత్తం చేసింది. కానీ ఈ విషయంపై పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో సుభాని చెలరేగిపోయాడు. అనతి కాలంలోనే రూ.వందల కోట్లు వసూలు చేసి మోసం చేశాడు.

పొరుగు రాష్ట్రంలోనూ ముంచేశాడు

- తెలంగాణ నుంచి బాధితుల రాక
- సుభాని ఇంట్లోని నగదు గోతాలు మాయం
- ఆరా తీస్తున్న పోలీసులు

కావలి: సుభాని తెలంగాణలోను ప్రజలను ముంచేశాడు. ఆ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా మక్తల్ నుంచి పోలీసులు కొందరు బాధితులతో కలిసి కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బుధవారం వచ్చారు. మక్తల్‌లో కూడా సుభాని షేర్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో జనాల నుంచి సొమ్ములు కొల్లగొట్టినట్లుగా చెప్పారని అంటున్నారు. ఇదిలా ఉండగా బుధవారం పలువురు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తాను, తన బంధువులు కలిసి రూ.90 లక్షలు ఇచ్చామని ఒక ఫొటోగ్రాఫర్ కన్నీరు మున్నీరయ్యాడు. చిన్న టీ స్టాల్‌ను నిర్వహించుకునే వ్యక్తి స్నేహితులందరం కలిసి రూ.19 లక్షలు ఇచ్చామని తమ జీవితం ఏమైపోతుందోనని భయంగా ఉందని వాపోయాడు. ఇదిలా ఉండగా సుభానీని పోలీసులు విచారణ కోసం తీసుకెళ్లిన రోజే కావలిలోని ఆయన ఇంట్లో ఉన్న నగదును కొందరు తరలించేశారని తెలిసింది. నగదును ఎక్కడికి తరలించారు? ఎవరు తరలించారు? అనే అంశాలపై విచారణ చేస్తున్నారు. ఈ స్కాంలో పోలీసుల పాత్ర ఎక్కువగా ఉండటంతో పాటు, వారి వ్యవహారాలు రోజుకొకటి వెలుగులోకి వస్తుండటంతో ఆ శాఖలో విభేదాలు తలెత్తినట్లుగా తెలుస్తోంది.

క్లుప్తంగా

16న జిల్లా స్థాయి యోగా పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 16న జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ అధ్యక్షులు నిర్మలా నర్సింహారెడ్డి తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న ఓవెల్ ఐసీఓ స్కూల్లో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. సబ్ జూనియర్ కేటగిరీలో 4, 5 తరగతులు, జూనియర్ కేటగిరీలో 6, 7 తరగతులు, సీనియర్ కేటగిరీలో 8, 9 తరగతుల విద్యార్థులకు విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్, ఓవెల్ స్కూల్ జీఎం మహాదేవ్ నాయుడు, ట్రస్ట్ సభ్యులు హేమంత్‌కుమార్ రెడ్డి, ప్రవల్లికారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

- వ్యక్తిపై కేసు నమోదు

వెంకటాచలం: ప్రేమిస్తున్నానంటూ ఓ యువతిని మోసం చేసిన మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన కె.మస్తాన్‌బాబు అనే వ్యక్తిపై వెంకటాచలం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మస్తాన్‌బాబు ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పడంతో యువతి నమ్మింది. అయితే అతను పెళ్లికి ఒప్పుకోకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల మధ్య వివాదం

- బ్లేడ్‌తో దాడి • ఇద్దరికి గాయాలు

ఉదయగిరి: ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల మధ్య బుధవారం బెంచీ విషయమై వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఓ బాలుడు షేక్ ముజ్బిల్, సుభాని అనే విద్యార్థులపై బ్లేడ్‌తో దాడి చేశాడు. వారు గాయపడగా వెంటనే ఉపాధ్యాయులు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. కాగా దాడి చేసిన బాలుడిని పోలీసులు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గతంలో కూడా ఈ విద్యార్థి ఉపాధ్యాయురాలితో గొడవపడినట్లు తెలిసింది.

కండలేరులో 53.602 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 53.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

జేఈఈ మెయిన్‌లో విద్యార్థుల ప్రతిభ



నిర్మల్ తేజ

నెల్లూరు(టౌన్): ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో పేదింటి బిడ్డ అత్యుత్తమ ఫలితాలు సాధించాడు. పి.నిర్మల్ తేజ అనే విద్యార్థి 98.83 పర్సంటైల్ సాధించాడు. ఇతను 1 నుంచి 10వ తరగతి వరకు కేఎన్నార్ మున్సిపల్ పాఠశాలలో చదివాడు. కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చేసి జేఈఈ మెయిన్‌లో జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధించాడు. దీంతో నిర్మల్ తేజను కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డిలు అభినందించారు. నిర్మల్ తేజ మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా ఉత్తమ ర్యాంక్ సాధించి బాంబే ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని తెలిపాడు.

నారాయణలో..



ప్రతిభ చూపిన విద్యార్థులతో నారాయణ యాజమాన్యం

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారని జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో జేఈఈ మెయిన్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ ఐఐటీ అకాడమీ నుంచి కె.పూర్వజ్ 99.98, ఎం.మధుకిరణ్‌రెడ్డి 99.93, బి.భానురిషిక్ 99.92, ఎం.అఖిలేష్ 99.91, ఎం.హేమంత్‌సాయి 99.84, సీహెచ్ నరసింహతేజ 99.76, కె.ఆశ్రిత 99.74, సంతోష్ 99.71, బి.యశ్వంత్‌బాబీ 99.70, పర్సంటైల్‌ను సాధించినట్లు వెల్లడించారు. 99 పర్సంటైల్‌కు పైగా 35 మంది, 98కి పైగా 62 మంది, 97కు పైగా 87 మంది, 95కు పైగా 132 మంది, 90కి పైగా 232 మంది సాధించారన్నారు. కార్యక్రమంలో కోర్ డీన్‌లు, డీన్‌లు, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

కృష్ణచైతన్యలో..



విజయకేతనం చూపుతున్న కృష్ణచైతన్య యాజమాన్యం, విద్యార్థులు

కృష్ణచైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని చైర్మన్ ఆర్.కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణాప్రమోద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి.నిర్మల తేజ 98.83, ఎండీ అజోల్‌సైఫీ 97.95, కె.అభినవరెడ్డి 97.70, పి.సాయికేతన్‌రెడ్డి 96.76, కె.మౌనిక 96.44 పర్సంటైల్‌ను సాధించారన్నారు. ఒకే క్యాంపస్ నుంచి 95 పర్సంటైల్‌కు పైగా 11 మంది, 90కి పైగా 21 మంది ఫలితాలు సాధించారని చెప్పారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ 40 మందికి పైగా అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రామాజంజనేయులురెడ్డి, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో..



స్వరూప్



సౌమ్యశ్రీ



వెంకటుషశ్రీ

శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయబావుటా ఎగురవేశారని డీన్ శ్రీరామ్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ కె.స్వరూప్ 99.4, ఎం.సౌమ్యశ్రీ 98.18, ఎస్‌వి.ఉషశ్రీ 95.10, కె.పవన్ 93.48, బి.దినేష్ 93.08 పర్సంటైల్ సాధించారన్నారు. 90కి పైగా 22 మంది, 85కి పైగా 40 మంది, 80కి పైగా పర్సంటైల్‌ను 52 మంది సాధించారన్నారు.

విశ్వసాయిలో..



సాయిరూపేష్

విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్‌లు తెలిపారు. బుధవారం స్థానిక మాగుంట లేవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో జేఈఈ మెయిన్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్ సాయిరూపేష్ జాతీయ స్థాయిలో 98.66 పర్సంటైల్ సాధించాడని చెప్పారు. 90కి పైగా 10 మంది, 80కి పైగా పర్సంటైల్‌ను 45 మంది సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.


గంజాయి విక్రయిస్తుండగా..

- నెల్లూరులో ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. మెక్లిన్స్ రోడ్డుకు చెందిన షేక్ అజీజ్, నెల్లూరు రూరల్ మండలం మాదరాజగూడూరుకు చెందిన ఎస్.సునీల్ గంజాయికి బానిసయ్యారు. వీరు కొంతకాలంగా ఎన్టీఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో విక్రయాలకు పాల్పడుతున్నారు. దీనిపై బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు నిఘా ఉంచారు. బుధవారం వారు ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో గంజాయిని విక్రయించేందుకు ఉన్నారని పక్కా సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని అజీజ్, సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	:రూ.40
సన్నవి	:రూ.25
పండ్లు	:రూ.18



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	114
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	234
లేయర్ చికెన్	145



టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సీనియర్ మెన్ అండ్ ఉమెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు శుక్రవారం జరుగుతాయని జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ యుగంధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరిగే 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్ట్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపే వారిని ఏప్రిల్, మే నెలలో జరిగే ప్రప్రథమ టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలకు వేలం ద్వారా ఎంపిక చేస్తారని తెలియజేశారు.

చంపేస్తానని బెదిరించడంతో..

- పెయింటర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్
- వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్న డీఎస్పీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో సంచలనం రేకెత్తించిన పెయింటర్ కల్యాణ్ హత్య కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన కోడూరు కల్యాణ్ (25) పెయింట్ పనులు చేస్తుంటాడు. అతడిపై నవాబుపేట పోలీసుస్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. ఈనెల 8వ తేదీ రాత్రి ఉడ్‌హౌస్ సంఘం వెనుక రోడ్డులో కల్యాణ్ స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా ఐదుగురు వ్యక్తులు మోటార్‌బైక్‌లపై వచ్చారు. కత్తులతో అతడిపై విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. గాయాలపాలైన కల్యాణ్‌ను స్నేహితులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. మృతుడి తల్లి వేశం గిణి ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా హత్య కేసు నమోదు చేశారు.

సాంకేతికత ఆధారంగా..

డీఎస్పీ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులు జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన దోనిపర్తి అజయ్‌కుమార్ అతడి స్నేహితులైన మన్సూర్‌నగర్‌కు చెందిన మురుగన్ అజిత్ అలియాస్ కుల్లా, భగత్‌సింగ్‌కాలనీకి చెందిన శివకుమార్, కుసుమ దళితవాడకు చెందిన ఎ.ఉదయ్‌కిరణ్, సత్యనారాయణపురానికి చెందిన వి.సురేంద్ర అలియాస్ సూరి అలియాస్ రాక్, స్టోన్‌హౌస్‌పేటకు చెందిన కె.పవన్‌కుమార్, శెట్టిగుంటరోడ్డుకు చెందిన కె.రమేష్, కిసాన్‌నగర్‌కు చెందిన జి.మనోజ్‌కుమార్‌లుగా గుర్తించి వారి కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా బుధవారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

ఆ భయంతోనే..

గతనెల 16వ తేదీన పెన్నానదిలో ఏటి పండగ జరిగింది. కల్యాణ్, అజయ్‌లు పండగకు వెళ్లి అక్కడ గాలిపటాలు ఎగురవేసే క్రమంలో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. కల్యాణ్ చేతిలో అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ఒకరినొకరు చంపుకొంటామని బెదిరించుకున్నారు. అప్పటి నుంచి అజయ్‌ను చంపుతామని కల్యాణ్ బెదిరించసాగాడు. భయంతో అజయ్ జరిగిన విషయాన్ని తన స్నేహితులకు తెలియజేశాడు. అందరూ కలిసి హత్యకు పథకరచన చేశారు.

పక్కాగా రెక్కీ..

పవన్ కుమార్, రమేష్, మనోజ్‌కుమార్‌లు కొద్దిరోజులుగా కల్యాణ్ కదలికలపై నిఘా ఉంచారు. 8వ తేదీ రాత్రి కల్యాణ్ తన స్నేహితులతో మద్యం తాగుతున్న విషయాన్ని వారు అజయ్‌కు చెప్పారు. అతను తన స్నేహితులు అజిత్, శివకుమార్, ఉదయ్‌కిరణ్, సురేంద్రలతో కలిసి రెండు బైక్‌లపై ఘటనా స్థలానికి చేరుకుని కల్యాణ్‌పై కత్తులతో దాడిచేసి హత మార్చినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కత్తులు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. త్వరలోనే వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. ఈ కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఎస్సైలు రహిమాన్, శివయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఆత్మకూరు: మండలంలోని బండారుపల్లి గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో ఇప్పగుంట కృష్ణయ్యకు, తిరుపాలుకు మధ్య భూ వివాదం ఉంది. గతంలో ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం కృష్ణయ్య సమీప బంధువైన సంపూర్ణమ్మపై తిరుపాలు, కిశోర్, రమణమ్మలు దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణయ్య తన మిత్రుడు సుధాకర్‌రెడ్డిని తీసుకొని ఘటనా స్థలానికి వెళ్లి దాడిని అడ్డుకున్నాడు. దీంతో తిరుపాలు, కిశోర్‌లు సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్యలపై దాడికి పాల్పడ్డారు. సుధాకర్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.



అంబులెన్స్‌లో క్షతగాత్రులు